కర్నాటక విజయంపట్ల కాంగ్రెస్ శ్రేణుల హర్షం

విశాలాంధ్ర - కాకినాడ : కర్నాటక ఎన్నికల ఫలితాల్లో విజయం దిశగా పయనించడంపట్ల స్థానిక జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. తమపార్టీ గెలుపుబావుట ఎగురవేయడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ నాయకుడు మల్లిపూడి రాంబాబు, మట్టా ప్రసాద్, ఆకుల వెంకటరమణ, కోలా వర్మ, పెద్దాడ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుకు రైతులు సిద్ధపడాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్రకృతి సాగుకు ప్రతి ఒక్కరు సిద్ధపడాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సంతోష్ సూచించారు. జగ్గంపేట మండలం గొల్లలగుంటలో నవధాన్యాల విత్తనాల కిట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు ఇస్తూ ఈ వేసవిలో నవధాన్యాలు సాగు చేపడితే భూమి సారవంతం అవడంతో పాటు, ఆదాయం కూడా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గడపగడపకు జననీరాజనం

విశాలాంధ్ర - కరప : కరప శివారు గ్రామం పేపకాయల పాలెంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ రూరల్ శాసనసభ్యులు, మాజీ మంత్రి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురసాల కన్నబాబు పాల్గొని ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందించామని మీ సమస్యలు మాకు తెలపండి అంటూ ప్రజల వద్దకు వెళ్లారు. ముందుగా ఎంపీటీసీ మద్దూరి గంగాభవాని భాస్కర్ జననీరాజనాలతో స్వాగతం పలికారు. గ్రామంలో మురుగునీరు పోయేందుకు డ్రైనేజీ కావాలని గ్రామస్తులు వివరించగా, వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని కన్నబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వై.సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, వైస్ ఎంపీపీ భీమన్నా సర్పంచ్ సాదే ఆశాజ్యోతి లోహిదాస్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌స్ప్లెండర్ ఎక్స్‌టెక్ విడుదల

విశాలాంధ్ర - కాకినాడ : ద్విచక్ర వాహనతయారీ సంస్థ హీరో రూపొందించిన సూపర్ స్ప్లెండర్ ఎక్స్‌టెక్ మార్కెట్‌లోకి విడుదలైంది. స్థానిక జయరాం ఆటోమొబైల్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మెకానిక్స్ యూనియన్ అధ్యక్షుడు సతీష్, కాకినాడ జిల్లా మెకానిక్స్ యూనియన్ అధ్యక్షుడు డి కన్నారావు ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. సూపర్ స్ప్లెండర్ మొదటి వాహనాన్ని షేక్ ఫకీర్‌సాహెబ్‌కు జయరాం ఆటోమొబైల్స్ పార్టనర్ డి.రవితేజ చేతులమీదుగా అందచేశారు. 125సీసీ ఇంజన్, బ్లూటూత్ కనెక్టివిటీ, మెసేజ్ సదుపాయంతోపాటు కాల్ అలర్ట్, ఎల్ఈడి హెడ్‌లాంప్, హైఇంటెన్సిటీ పొజిషన్ లాబ్ వంటి ఫీచర్లతో కూడిన ఈ వాహనం బ్లాక్, మ్యాటీగ్రే రంగుల్లో అందుబాటులో ఉందని షోరూం నిర్వాహకులు తెలిపారు.

సమాచార హక్కు పరిరక్షణ సమితి కోఆర్డినేటర్‌గా గోవిందు

విశాలాంధ్ర - రౌతులపూడి : జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆంధ్రప్రదేశ్ కో ఆర్డినేటర్‌గా రౌతులపూడి మండలం, రౌతులపూడి గ్రామానికి చెందిన జి. గోవిందును నియమిస్తూ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మర బోయిన కేశవులు ఆదేశాల మేరకు రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి నియామక పత్రం జారీ చేశారు. సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని బయటకు తీస్తూ

సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ గురుతర బాధ్యత అప్పగించి నందుకు అవినీతి రహిత సమాజ నిర్మాణంలో పాలుపంచుకునే విధంగా నా కర్తవ్యాన్ని నిర్వహిస్తానని గోవింద్ అన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర - కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ, కాకినాడ గాంధీనగర్ శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం నాడు పాఠశాల విద్యార్థులకు డాన్స్, డ్రాయింగ్, కథలు చెప్పడం, హ్యాండ్ రైటింగ్, లలో శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు డాన్స్, హ్యాండ్ రైటింగ్ లలో ఉపాధ్యాయురాలు

సిహెచ్ వాణి శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు డ్రాయింగ్‌లో మెళకువలను డ్రాయింగ్ మాస్టర్ పీ.వీరబాబు వివరించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి అధిక సంఖ్యలో విద్యార్థులను పంపిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులకు ప్రతివారం వారు శిక్షణ పొందిన అంశాలపై కాంపిటీషన్స్ నిర్వహించి బహుమతులను అందజేస్తామని తెలిపారు.

పూడిక తీత పనులతో రైతులకు మేలు

విశాలాంధ్ర - నిడదవోలు : గుర్రపు డెక్కచెత్త చెదారంతో నిండుకున్న పంట కాలువ పూడిక తీత పనులతో గ్రామానికి, రైతులకు మేలు జరుగుతుందని మండల వైసీపీ అధ్యక్షులు అయినీడి పల్లారావు అన్నారు. నిడదవోలు మండలం తిమ్మరాజు పాలెం గ్రామానికి ఆనుకుని ఉన్న సుమారు 2కి.మీ

పంటకాలువ గురపుడొక్కాచెత్త,మట్టితో నిండుకుంది. దాంతో పంట పొలాలకు నీరందక పోవడంతో పాటు పొలాల్లోని మురుగునీరుకు ఆటంకంగా మారింది. పంటబోదు నుండి దుర్గంధం వెలువడుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్పందించిన పల్లారావు పూడుకు పోయిన కాలువను సుమారు 90వేల రూపాయలు సొంత నిధులతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా అయినీడి పల్లారావు మాట్లాడుతూ పూడిక తీత పనులతో గ్రామానికి, రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపిటిసి పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షులు యాళ్ళ రామారావు, పార్టీ ప్రెసిడెంట్ పడాల శ్రీనివాస్, తిమ్మరాజు పాలెం గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

జొన్నాడలో హిజ్రా దారుణ హత్య

విశాలాంధ్ర - ఆలమూరు : అంబేద్కర్ కొనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గ్రామంలో 216(ఏ) జాతీయ రహదారిపై కాలువ డ్యామ్ వద్ద హిజ్రాను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసి పంట కాలువలో విసిరి వేశారు. స్థానికులు తెలియజేసిన వివరాలు ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా మాధవరం మండలం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన మరిపట్ల ఆనంద్ (33)ను (హిజ్రాను) గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి తీవ్రంగా గాయపరిచి హత్యచేసి పంట కాలువలో విసిరివేశారు. శనివారం ఉదయం కొత్తపేట డిఎస్పి కే వెంకటరమణ, రావులపాలెం సర్కిల్ సీఐ రజిని కుమార్, రావులపాలెం ఎస్సై వెంకటరమణ కలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పూర్తి ఆధారాలు కొరకు వేలిముద్ర నిపుణులను, డాగ్ స్క్వాడ్ బృందాన్ని పిలిపించి స్థానిక ఎస్ఐ ఎస్ శివప్రసాద్ తమ సిబ్బంది సహకారంతో మరిన్ని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై స్థానిక ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

జీవో కొట్టివేయడం శుభపరిణామం

విశాలాంధ్ర - రంగంపేట : సీఎం జగన్మోహన్ రెడ్డి నిరంకుశ జీవో 1 తీసుకురావడం జరిగిందని కానీ హైకోర్ట్ ఈ జీవో కొట్టు వేయడం శుభపరిణామమని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు

తమలంపూడి సుధాకర్ రెడ్డి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నల్లమిల్లి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మొత్తం ప్రజానీకం ఎన్నికలు ఎప్పుడు వస్తాయని ఎదురు చూస్తున్నారని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా చేయాలని రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలని ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకర్ రెడ్డి, కర్రి వెంకట రామారెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులు దళారులపట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - కాకినాడ : ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు దళారులపట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి తెలిపారు. జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తడిసిన ధాన్యం, బొండాలు రకం కొను గోలు తదితర విషయాలపై వివరించారు. వర్షం కారణంగా రైతుల ఇబ్బంది దృష్టిలో ఉంచుకుని వారిని సమాయత్తంచేసి రాష్ట్రవ్యాప్తంగా, జిల్లా వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించారన్నారు.

రైతులకు ఇబ్బందిలేకుండా పాడైన, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, తెలంగాణా రాష్ట్రంకంటే మెరుగ్గా ఈ ప్రక్రియ జరపుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వానికి మిల్లర్ల సహకారం ఉంటుందని, సమస్యలు తలెత్తకుండా మిల్లర్లు అందుబాటులో ఉంటున్నారన్నారు. వారిపై ప్రతిపక్షాలు లేనిపోని బురద చల్లవద్దని కోరారు. ధాన్యం సేకరణకు కేంద్ర అనుమతి పొందా మని, బాయిల్డ్ రైస్ 5లక్షల వరకు అనుమతి వుందని, మొత్తం 9లక్షల ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కోనసీమ రైస్‌మిల్లర్ల సంఘా ధ్యక్షుడు పట్టాభిరామయ్యచౌదరి, తూర్పుగోదావరి జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి బుల్లిమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతతత్వం ఓడింది... లౌకిక వాదం గెలిచింది

విశాలాంధ్ర- రాజమండ్రి: బిజెపి హఠావో దేశ్ బచావో... బిజెపిని సాగనంపుదాం దేశాన్ని కాపాడుకుందాం అని సిపిఐ జాతీయ సమితి పిలుపును కర్ణాటక ప్రజలు అమలు చేయడం, బిజెపి మతతత్వ రాజకీయాలకు బుద్ధి చెప్పి లౌకికవాదం కాపాడినందుకు కర్ణాటక ప్రజలకు ధన్యవాదములు తెలియజేస్తున్నట్లు సిపిఐ

జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలు సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక ఎన్నికల సభలో దేశ ప్రధాని జై భజరంగ్ దళ్ పిలుపునిచ్చాడంటే ఈ దేశాన్ని, ఆయా రాష్ట్రాలను బిజెపి ఎటువైపు తీసుకెళ్తుందో కర్ణాటక ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. భారత రాజ్యాంగం ,ఫెడరల్ లౌకిక వ్యవస్థ పై ప్రమాణం చేసి పాలిస్తున్న మోడీ ఉగ్రవాదులతో సమానమైన జై భజరంగ్ దళ్ ను కీర్తించడం కర్ణాటక ప్రజలు అసహ్యించుకున్నారని మధు తెలిపారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలు చూసైనా జగన్, చంద్రబాబు, పవన్ మారాలని మధు కోరారు. గతంలో మోడీ వల్ల దేశం తిరోగమనంవైపు వెళుతున్నదని చెప్పిన చంద్రబాబు నేడు వచ్చే ఎన్నికల్లో తన అవకాశవాద రాజకీయాల కోసం మోడీ విజనరీ బాగుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని మధు అన్నారు. ఈ ముగ్గురు నేతలు కర్ణాటక ప్రజలను చూసి బుద్ధి తెచ్చుకుని రాష్ట్ర హక్కుల కోసం, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం, ప్రత్యేక హోదా కోసం కమ్యూనిస్టులతో కలిసి పోరాటానికి సిద్ధం కావాలని మధు పిలుపునిచ్చారు.

విద్యార్థులకు విద్యాశాఖ అధికారి అభినందనలు

విశాలాంధ్ర - రాజోలు : పదవ తరగతి పరీక్ష ఫలితాలలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో ప్రథమ శ్రేణిలో ప్రతిభ కనబరిచిన మోరి హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని, మలికిపురం, రాజోలు, సఖినేటిపల్లి మండలాల్లో ప్రతిభ

కనబరిచిన విద్యార్థులను శనివారం మలికిపురంలోని ఎంవి ఎన్‌జెఎస్ అండ్ ఆర్‌విఆర్ కళాశాల ఆవరణలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారిణి కమల కుమారి పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుని మరింత అభివృద్ధి చెందాలన్నారు. విద్యార్థుల ప్రతిభ కనబరచడానికి విశేష కృషిచేసిన ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ అంబేద్కరిస్ట్ ఎంఎకె భీమారావు, వివిధ విద్యార్థి సంఘాల ఇన్చార్జిలు దేవ రాజేంద్రప్రసాద్, రాపాక మహేష్, పోలిశెట్టి గణేష్, తాడి సహదేవ్, తాడి రవీంద్ర విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమలాపురంలో సంబరాలు

విశాలాంధ్ర - అమలాపురం : కర్ణాటక రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 137 సీట్లు సాధించి విజయ దుందుభి మోగించింది. ఈ సందర్భంగా అమలాపురం పట్టణం గడియార స్తంభం సెంటర్లో పట్టణ అధ్యక్షులు ఒంటెద్దు బాబి, ఇన్‌చార్జి

అయితాబత్తుల సుభాషిని ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కుడుపూడి శ్రీను, ఏఐసిసి మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, ఎస్సీ విభాగం స్టేట్ కన్వీనర్ డాక్టర్ రాజేంద్ర బాబు, ధోనిపాటి విజయలక్ష్మి, దామిశెట్టి జయ, నిమ్మకాయల ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయంతో హర్షం

విశాలాంధ్ర-దేవరపల్లి: కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించడంతో మండలంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకు న్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ

సందర్భంగా స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకర్ల హరిబాబు, చాపల వెంకటేశ్వరావు, దాసరి కుటుంబరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాక చిన్నబ్బాయి, పి గంగారావు, సూరిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృతజ్ఞతలు తెలిపిన పడాల

విశాలాంధ్ర - రంగంపేట : జిల్లా వైసీపీ ట్రేడ్ యూనియన్ సెక్రటరీగా నియమించినందుకు పడాల వెంకటరెడ్డి ఎమ్మెల్యే సత్తి సూర్య నారాయణ రెడ్డిని మర్యాద

పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకి పూలమాల వేసి, శాలువా కప్పి పడాల సత్కరించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి ఏసుదాసు, మాజీ సర్పంచ్ తాడి సూరారెడ్డి, అర్తమూరు శివ,మర్రె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర - రంగంపేట : విద్యార్హతను బట్టి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జి బి ఆర్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో ఎమ్మెల్యే సత్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 373 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 142 విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్‌పి అబ్బాయి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిబిఆర్ విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు), ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన విధానం పట్ల హర్షం

విశాలాంధ్ర - రంగంపేట : వైసీపీ ప్రభుత్వం విద్యలో నూతన విధానాలకు తెర తీయడంతో విద్యార్థులకు మేలు జరుగుతోంది. ఏ ఒక్క విద్యార్థి విద్యలో వెనక పడకూడదనే ఉద్దేశ్యంతో ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంతకుముందు ఎప్పుడు లేని విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరాగాంధీ బైపాస్ రోడ్డు ప్రారంభం

-రూ.1.90 కోట్లతో సీసీ రోడ్డు అభివృద్ధి

-12వ వార్డులో పలు రోడ్లకు శంకుస్థాపన

విశాలాంధ్ర - మండపేట : మండపేట మున్సిపాలిటీలో ఉన్న వార్డుల్లో కోట్లాది రూపాయలతో అనేక చోట్ల రోడ్లు డ్రైన్‌లు ఇంకా అనేక భవనాలు నూతనంగా రూపుదిద్దుకొని పట్టణం ప్రగతి పథం వైపు పయనిస్తుందని శాసన

మండలి సభ్యుడు తోట త్రిమూర్తులు అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నూతనంగా అభివృద్ధి పరిచిన ఇందిరాగాంధీ బైపాస్ రోడ్డును ఆయన శనివారం ప్రారంభించారు. 12వ వార్డు కౌన్సిలర్ మలసాని సీతా మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖుడు వ్యాపారవేత్త బిక్కిన నర్సింగ్ హోమ్ అధినేత బిక్కిన సత్యనారాయణ(చిన్న), వైఎస్సార్సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, వైస్ చైర్మన్ పిల్లి గనేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి ఆయన టెంకాయలు కొట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి బైపాస్ రోడ్డును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కొంతమేర నూతన రోడ్డు వెంబడి నాయకులతో కలిసి నడిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్నారన్నారు. అందులో భాగమే ఇందిరాగాంధీ బైపాస్ రోడ్డు అభివృద్ధి అన్నారు. అనంతరం కౌన్సిలర్ సీతా మహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో పాల్గొని స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. బైపాస్ రోడ్డు పక్కన వున్న రెండు క్రాస్ రోడ్లకు ఆయన టెంకాయలు కొట్టి మంచి చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పిల్లి గనేశ్వరరావు, కౌన్సిలర్లు పోతంశెట్టి ప్రసాద్, పిల్లి శ్రీనివాస్, అమలదాసు లక్ష్మి, శెట్టి కళ్యాణి, మెండు బాపిరాజు, గ్రంధి శ్రీనివాస్, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, డ్వాక్రా మహిళలు, పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు ఆర్వో ప్లాంట్ బహూకరణ

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: విద్యార్థుల మనోవికాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయన్నారు తణుకు శ్రీ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్ నిర్వహణాధికారి బాలకృష్ణ. కార్పొరేట్ సామాజిక బాధ్యత పథకంలో భాగంగా ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డైనింగ్ హాల్లో మినరల్ వాటర్ యూనిట్‌ను స్పిన్నింగ్ మిల్ యాజమాన్యం తరఫున బహూకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వ ప్రసాద్ శనివారం తెలిపారు. దీంతోపాటు పాఠశాల క్రీడా ప్రాంగణం లో ట్రాక్, కోర్ట్ ల కొరకు మట్టితో ఆధునీకరించి, పాఠశాలకు సహకారం అందించారన్నారు. గ్రామ సర్పంచ్ మెండే వెంకటరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సోంబాబు, చేతుల మీదుగా మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్పిన్నింగ్ మిల్ అధికారులు ఉమా శంకర్, బాలకృష్ణ, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు స్వామి, పుష్పవల్లి, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సహాయకునిగా లక్ష్మణ నాయక్

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉండ్రాజవరం మండల సాంకేతిక సహాయకునిగా శుక్రవారం పి.లక్ష్మణ్ నాయక్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన నిడదవోలు నుండి ఉండ్రాజవరానికి బదిలీపై రాగా, ఇంతకు ముందు పనిచేసిన టెక్నికల్

అసిస్టెంట్ జి.కాంతారావు నిడదవోలు మండలానికి బదిలీ పై వెళ్లినట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాసు తెలిపారు.

పాదయాత్రకు మద్దతు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం:ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతుల పరామర్శకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం తణుకు నియోజకవర్గం ఇరగవరం నుండి తణుకు పట్టణానికి పాదయాత్ర చేపట్టారు. ఈ

కార్యక్రమానికి మద్దతుగా మండలం నుండి భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు.

బస్సు షెల్టర్ను కూల్చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం మండలం కొమానపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొమ్మనపల్లి సెంటర్లో ఉన్న ఆర్టీసీ బస్సు షెల్టర్ను, వివిధ అభివృద్ధి పనులకు గాను ఏర్పాటు చేసిన శిలాఫల కాలను కాకి గోపాలకృష్ణ, కొంతమంది దౌర్జన్యంగా ప్రొక్లెయినర్లతో కూల్చి నేలమట్టం చేశారు.

గత 26 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్‌ను అప్పటి మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగి ప్రారంభించారు. ప్రయాణికులకు ఎంతో ఉపకారంగా ఉండే ఈ షెల్టర్‌ను కూల్చడం, ప్రభుత్వ ఏర్పాటు చేసిన శిలాఫలకాలను కూల్చివేసి పారవేశారు. బస్సు షెల్టర్ కూల్చివేత శిలాఫలకాలు తొలగింపు పై కోమానపల్లి గ్రామ ప్రజలు పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్‌కు, ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళపై కత్తితో దాడి : తృటిలో తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర - సీతానగరం : మహిళ పై కత్తితో దాడి చేయగా తృటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలో చీపురుపల్లి గ్రామానికి చెందిన పెద్దే నాగమణి భర్త పెద్దే అర్జునుడి మీద 2020 సంవత్సరంలో వరకట్నం కేసు పెట్టింది. ఈ కేసు కోర్టులో నడుస్తున్నది. కేసు పెట్టిన తరువాత నాగమణి బ్రతుకు దెరువు కోసం కువైట్ వెళ్ళిపోయింది. ఈ సంవత్సరం తిరిగి వచ్చి మూడు నెలలు అవుతోంది. శనివారం నీళ్లు అవసరమై కుళాయి దగ్గరికి

వెళ్తుండగా భర్త త్రాగి కత్తితో దాడి చేయగా మెడ, నడుం, కుడి చేతి మీద కత్తితో నరకడంతో ఆమె వెంటనే రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకొని వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

చెయ్యేరు గ్రామపంచాయతీకి రు.50 వేల రివార్డు

విశాలాంధ్ర - కాట్రేనికోన : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని చెయ్యేరు గ్రామ పంచాయతీకి ఆర్థిక పురస్కారం లభించింది. అభివృద్ధి-ఆర్థిక ప్రణాళికలో జిల్లాలోనే చెయ్యేరు గ్రామపంచాయతీ మొదటి స్థానం సాధించడంతో ప్రభుత్వం 50వేల రూపాయలు రివార్డు ప్రకటించింది. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా విడుదల చేసిన 50,000 రూపాయలు గ్రామపంచాయతీ అకౌంట్లో జమ అయినట్లు చెయ్యేరుపంచాయతీ కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ చెల్లి సురేష్, పాలకవర్గ సభ్యులు ప్రణాళిక బద్ధంగా గ్రామాభివృద్ధి చేసినందుకు ఈ పురస్కారం

లభించింది. ఈ సందర్భంగా సర్పంచ్ చెల్లి సురేష్‌ను పలువురు నాయకులు అభినందించారు. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మండల టీడిపి అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, మాజీ జెడ్పీటీసీలు నాగిడి నాగేశ్వరరావు, ఇసుక పట్ల వెంకటేశ్వరరావు, నాయకులు సుధా నాగభూషణం, వెంట్రు సుధీర్, వాసంతి రాజేశ్వరరావు తదితరులు అభినందించారు.

ప్రధాన రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని రాజపూడి గ్రామ ప్రధాన రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. జగ్గంపేట నుండి గోకవరం వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో రాజపూడి గ్రామం ఉంది. ఈ గ్రామంలో ఆర్ అండ్ బి రోడ్డును దాటుతూ ఉన్న కల్వర్టు నుండి మురుగునీరు వెళ్లకపోవడంతో రోడ్డుపైనే ప్రవహిస్తోంది. అటు ఆర్

అండ్ బి అధికారులు కానీ, ఇటు పంచాయతీ అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో దుర్వాసనవెదజల్లుతోంది. రహదారి పక్కనే ఉండే కాలనీవాసులు వాడిన మురుగునీరు కూడా రోడ్డుపైనే ప్రవహిస్తోంది. డ్రైనేజీలు లేకపోవడంతో ఇలా రోడ్డుపైకి నీరు వస్తుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని, కల్వర్టు నుండి వెళ్లాల్సిన నీరు పోయే మార్గాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థుల భవిష్యత్తు ఆలోచించే నాయకుడు వర్మ

విశాలాంధ్ర - పిఠాపురం : వర్మాస్ కావ్య ఫౌండేషన్ ద్వారా మాజీ ఎమ్మెల్యే వర్మ పేద విద్యార్థులకు ఉచితంగా నిర్వహించిన ఎంసెట్ కోచింగ్ నేటితో ముగిసింది. ఈ సంద ర్భంగా వర్మ విద్యార్థులను కలసి రేపు జరగబోయే ఎంసెట్ పరీక్షలో ప్రతిఒక్కరు మంచి ర్యాంకులు సాధించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు వర్మను శాలువాతో

సత్కరించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ తల్లిదండ్రులకు, ఈ ఎంసెట్ కోచింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు, వర్మాస్ కావ్య ఫౌండేషన్‌కు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డం భాస్కర రావు, పిల్లి చిన్న, అల్లవరపు నగేష్, సురవరపు సుబ్బారావు, వియ్యపు రామనరాజు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం చారిత్రాత్మకం

విశాలాంధ్ర - మామిడికుదురు : కర్ణాటక రాష్ట్రంలో శనివారం ప్రకటించిన ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం పట్ల మామిడికుదురులో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక సెంటర్లో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుతూ విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గెద్దం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గెలుపు కోసం బిజెపి ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలంతా కాంగ్రెస్ వెంటే ఉండటం

హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో నీతిపూడి బాల సత్యనారాయణ, అప్పన రామ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో : కర్ణాటక రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నెల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఆరిఫ్, పిసిసి మెంబర్లు ములపర్తి మోహనరావు, మాచవరపు శివన్నారాయణ, మహ్మద్ ఇస్మాయిల్, మండల ప్రధాన కార్యదర్శి ఆదుర్తి నారాయణమూర్తి, కొల్లి సరోజని, పులిదిండి బాలయోగి, మహమ్మద్ హాబిబి తదితరులు పాల్గొన్నారు.

దమ్మెన్ను సర్పంచ్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: గుర్తింపు, ప్రశంస పొందడం ద్వారానే చేసిన పనికి సార్థకత చేకూరుతుందన్నారు ఈవోపీఆర్డి ముత్యం వీరాస్వామి నాయుడు. బుధవారం మండలం లోని దమ్మెన్ను సచివాలయంలో సర్పంచ్ గురజర్ల వీర వెంకట సత్యనారాయణకు పంచాయతీ సిబ్బంది చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడుతూ జాతీయ

పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ పంచాయతీల అవార్డులలో భాగంగా దమ్మెన్ను పంచాయతీ వివిధ కేటగిరీలకు గాను ఐదు అవార్డులు సాధించిందన్నారు. ఈ కారణంగా సర్పంచ్, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పలు గ్రామాలకు ఆదర్శప్రాయంగా దమ్మెన్ను నిలవాలన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రశంసించి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వానికి, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

108లో ప్రసవం, తల్లీ, బిడ్డ క్షేమం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: గర్భిణీని కాన్పు కొరకు 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో వాహనంలోనే ప్రసవించిన సంఘటన మండలం లోని కాల్దారిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎం. మంగమ్మకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆశ వర్కర్ ను సంప్రదించారు. ఆమె, ఉండ్రాజవరం 108 సిబ్బంది గర్భిణీ ని ఉండ్రాజవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మార్గం మధ్యలో చిలకపాడు ప్రాంతంలో పురిటి నొప్పులు అధికం కావడం తో ఈఎంటీ వరప్రసాద్, పైలట్ చంద్రశేఖర్ లు, ఆశ వర్కర్ల సహాయంతో డెలివరీ చేశారు. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిందని వైద్యులు తెలిపారు. తదుపరి చికిత్స కోసం ఉండ్రాజవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగమ్మ కుటుంబ సభ్యులు వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

22వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు పట్టణం 22 వ వార్డులో శనివారం"గడప గడపకు మన ప్రభుత్వం" 119 వ రోజు కార్యక్రమం శనివారం విజయవంతం గా నిర్వహించారు. నవరత్నాలలో భాగముగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రజలలో ప్రచారం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ వైసీపీ ఇంఛార్జ్ కవురు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల నుండి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ను ఆశీర్వదించాలని ప్రజలను శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమం వైసీపీ నాయకులు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్ పి. పెద్దిరాజు, వార్డు ఇంఛార్జి పిల్లా శ్రీనివాస్, పట్టణ జేసిఎస్ కన్వీనర్ మద్దాల వాసు, గ్రామ సచివాలయ కన్వీనర్ లు, గృహ సారథులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల హర్షం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీ సీట్లతో విజయం సాధించడం పట్ల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసినట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దాల ప్రసాద్, మాజీ జెడ్పిటిసి సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ సందర్భంగా శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.కర్ణాటక విజయం ప్రజా విజయమని,ప్రజలు బిజెపిని తిరస్కరించారనే విషయాన్ని కర్ణాటక ఎన్నికల ఫలితాలు చూస్తే అర్థమవుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ లోని కాంగ్రెస్ నాయకులు జెట్టి గురునాథరావు కార్యాలయం వద్ద కాంగ్రెస్ స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో ద్విచక్ర వాహనాలపై ప్రదర్శన చేశారు. తీన్మార్ డబ్బులతో సందడి చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నులకని నాగబాబు, జిల్లా కార్యదర్శి వనచర్ల లింగస్వామి, తాడేపల్లి ఉమాదేవి, రొక్కం ఆదినారాయణ, మొగిలినీడిశ్యాం, పంగిడిగూడెం కాంగ్రెస్ నాయకులు అడవికొట్టు రవి, జంగా కమలాకర్ రెడ్డి, ప్రసాద్,మామిడి రాము, జమీర్ షరీఫ్, జీడిగింటి రామారావు, మద్దిపాటి శ్రీను వసంతాడు మంగరాజు, ఉన్న శివ, సోమరాజు, దోక్క లక్ష్మణ్, గోలిశ్రీనివాసరెడ్డి, మామిడి రాము, ఎర్ర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు సాలిపేటలో దాస అంజనేయ స్వామి ఆలయం వద్ద ఆదివారం ఉదయం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరగడానికి అన్ని ఏర్పాటు చేసామని ఆలయ ఆర్గనైజర్ ప్రసాద్ తెలిపారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. హనుమాన్ జయంతి వేడుకలు 16వ తేదీ వరకు జరుగుతాయి. 14, 15 తేదీలలో స్వామివారికి పూజా కార్యక్రమం నిర్వహిస్తారు. 16 వ తేదీ మంగళవారం భారీ అన్న కార్యక్రమం జరుగుతుందని భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

గంజాయి తాగుతుండగా అరెస్టు

విశాలాంధ్ర-వీరవాసరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే గేట్ సమీపంలో అన్నపూర్ణ లాజిస్టిక్స్ గోడౌన్స్ వెనుక గంజాయి తాగుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులో తీసుకుని సోదా చేయగా వారి వద్ద నుండి సుమారు 90 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిపై అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, ఎన్డిపిఎస్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

లింగపాలెంలో సబ్ డివిజన్ స్థాయి స్పందన

విశాలాంధ్ర - లింగపాలెం : నూజివీడు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న మండలాలకు స్పందన కార్యక్రమాన్ని లింగపాలెం తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ తెలిపారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో సబ్ డివిజన్ స్థాయి స్పందన లింగపాలెంలో ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ స్పందనలో సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పాల్గొంటారని అన్నారు.

వేసవి శిబిరాలు ఉపయోగకరం

విశాలాంధ్ర-వీరవాసరం: వేసవి శిబిరాలు విద్యార్థినీ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నా యని పలువురు ప్రముఖులు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులకు దేశభక్తి గీతాలను రిసోర్స్ పర్సన్ పిఎవి లక్ష్మి, డ్రాయింగ్ సైన్సు ప్రయోగాలు, పాటలు, డాన్స్ మల్లుల శ్రీనువాస్ లు నేర్పించారు. బండారు అప్పారావు ఆటలు ఆడించారు. గ్రంథాలయాధికారి హనుమంతురావు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 43 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విష ప్రయోగంతో చేపలు మృతి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రక్కనే ఉన్న అక్కమ్మ కోనేరు (రజక) చెరువులో చెరువులో విష ప్రయోగం జరిగి చేపలు మృతి చెంది న ఘటనలో రూ.4లక్షల 50వేల నష్టం వాటిల్లిందని రజక సంఘ నాయకులు మందపల్లి లక్ష్మయ్య, తూటిగుంట దుర్గారావు తెలిపారు.ఈ సందర్భంగా రజక సంఘ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం గతంలో రెండుగా ఉన్న రజక సంఘం ప్రస్తుతం ఒక్కటిగా కలిసి ఉందని, గత మూడు నెలల క్రితం తమ సంఘం తరపున చేప పిల్లలు చెరువులో వేశామని తెలిపారు.చేపలు పెరిగి పెద్దవవడంతో మరి కొద్ది రోజుల్లో చేపలను పట్టి విక్రయించాలనుకునే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో విష ప్రయోగం చేశారని దీంతో చెరువులో చేపలన్నీ చనిపోయి పైకి తేలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా స్థానిక ఎస్ ఐ సాగర్ బాబు చెరువు వద్దకు వచ్చి చనిపోయిన చేపలను పరిశీలించారు. సంఘ నాయకులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ బాబు తెలిపారు .

ప్రజా సంక్షేమమే ధ్యేయం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన అందిస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే వి ఆర్ ఎలిజా అన్నారు.శనివారం మండలం లోని మైసన్నగూడెం గ్రామ సచివాలయం పరిధి లో గడప గడప కు

మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎలిజా నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో తమ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జి, సర్పంచ్ సింగిదాసు హైమవతి, మండల సచివాలయల కన్వీనర్ గురజాల పార్థసారధి , మండల యువ నాయకుడు గంజి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో వినోదం

విశాలాంధ్ర-ముసునూరు: వేసవిలో యువకులకు క్రికెట్ మంచి వినోదాన్ని ఇస్తుందని మాజీ రైతు సంఘం నాయకులు అక్కినేని చందు,సూరేపల్లి గ్రామపార్టీ అధ్యక్షులు మల్లిబాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని సూరేపల్లి గ్రామంలో పొన్నగంటి చందు యూత్ ఆధ్వర్యంలో ప్రిమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు జరుగుతుండగా,పర్వతనేని గంగాధరరావు ప్రైజ్ మనీ నిమిత్తం రూ.60.000 ఇచ్చినందుకు ఆయన్ని అభినందించారు.శోభనపురం గ్రామ సర్పంచ్ నక్కనబోయిన వేణు,తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : విద్యార్థులు చిన్ననాటి నుండి గ్రంథాలయాలను అలవాటు చేసుకోవాలని ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు జి.శేఖర్ తెలిపారు. శాఖా గ్రంథాలయం వద్ద జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు , నీతి కథలు, చదవడం, రాయడం పై పలు సూచనలను విద్యార్థిని విద్యార్థులకు శేఖర్ సూచించారు. గ్రంథాలయంలోని వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు ఏర్పాటు చేసి ఆరవ రోజు పూర్తి అయ్యిందని, ఇంకా కొద్ది రోజులు విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తామని, గ్రామంలోని ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు అలవాటు చేయాలని, చిన్ననాటి నుండే విద్యార్థులను గ్రంథాలయాలకు అలవాటు చేస్తే , విజ్ఞానంతో పాటు లోకజ్ఞానం కూడా తెలుస్తుందని , ప్రతిరోజు వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారని గ్రంథ పాలకురాలు యు. రాముడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

16న మినీ జాబ్ మేళా

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 16న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి పి.లోకమాన్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, బిటెక్, బి ఫార్మసీ వరకు చదివి పాసైన అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునని తెలిపారు.

డ్రైనేజీ పూడికతీతలు

విశాలాంధ్ర - కరప : కరప మండల గ్రామాలలో స్పెషల్ శానిటైజేషన్ డ్రైవ్ షెడ్యూల్లో భాగంగా శనివారం కరప, వేలంగి, కొంగోడు, గురజనాపల్లి, గొరుపూడి, నడకుదురు, వేములవాడ, యండమూరు, అరట్లకట్ట, తదితర గ్రామాలలో డ్రైనేజీలలో పూడికతీతలు, కచ్చ డ్రైన్లు శుభ్రపరచినట్లు మండల పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. అన్ని గ్రామాలలో యుద్ధ ప్రాతిపదికన పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తొలగించారు. నీరు నిలవుండే ప్రదేశాలలో నీరు పోయే మార్గాలను శుభ్రం చేసామన్నారు. ఈనెల 22వ తేదీ వరకు గ్రామాలలో ఉన్న పనులను చేపడుతున్నామన్నారు.

15 మందిపై కేసు నమోదు

విశాలాంధ్ర - చాగల్లు : వాహన ప్రమాదాలను అరికట్టాలనే ఉద్దేశ్యంతో చాగల్లు మండలంలో గత వారం రోజులుగా ప్రతి రోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సరైన పత్రాలు లేని, ప్రమాదకరం గా వాహనాలు నడిపే వ్యక్తులపై కేసులు నమోదు చేయనున్నట్టు ఎస్సై సి హెచ్ వి రమేష్ తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం 15 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు ఆయన అన్నారు . ఇప్పటివరకు ఈ విధంగా 45 మంది పై కేసులు నమోదు చేసి న్యాయస్థానం హాజరుపరిచామన్నారు. ప్రజలందరు సరైన వాహన పత్రాలు కలిగి ఉండాలని, ప్రమాదభరితంగా కాకుండా సరైన రీతిలో వాహనాలు నడపాలని తద్వారా వాహన ప్రమాదాలను అరికట్టాలనేది పోలీస్ వారి ఉద్దేశమని ఎస్సై సిహెచ్ వి. రమేష్ తెలిపారు.

అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - బిక్కవోలు : బిక్కవోలు మండలం ఆరికరేవుల గ్రామంలో శనివారం కొత్తగా అంగన్వాడీ భవనానికి అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం వైఎస్ జగనన్న కాలనీలో కొత్తగా కరెంటు ట్రాన్స్ఫార్మర్‌ను రాష్ట్ర పంచాయతీ రాజ్ సెక్రటరీ, మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి

(బుజ్జి) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు,(గామ అభివృద్ధి కమిటీ చైర్మన్ తొండాపు గాంధీ రెడ్డి, ఎంపీటీసీ కొర్ల చక్రధరరావు, ఉప సర్పంచ్ శాఖ రాజు తదితరులు పాల్గొన్నారు.

600 రోజులుగా నిరసన

- విధుల్లోకి తీసుకోవాలని జిజిహెచ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన
- హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో తొలగించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది ఆందోళన శనివారం నాటికి 600 రోజులకు చేరుకుంది. 2021 సెప్టెంబరులో 65 మంది కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని, 2022 జూన్‌లో 89 వికాస ఔట్ సోర్సింగ్ సిబ్బందిని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విధుల నుంచి ఆసుపత్రి యాజమాన్యం తొలగించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి తమకు న్యాయం చేయాల్సిందిగా హైకోర్ట్ ఆదేశాలను అమలు చేయాలంటూ ఆసుపత్రి ఎదుటే నిరశన దీక్షలు ప్రారంభించారు. మండుటెండను, కుంభవృష్టి వర్షాన్ని కూడా లెక్కచేయకుండా గత 600 రోజులుగా నిరసన కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా సిఐటీయు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో అడ్డగోలుగా తొలగింపులు జరుగుతున్నాయని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారి ఉత్తర్వులను కూడా జిజిహెచ్ అధికారులు లెక్కచేయడం లేదన్నారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డిఏ రతన్ రాజ్, జిజిహెచ్ నాయకులు జి నాయుడు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్ విజయ్ కుమార్లు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నాయకులు పిఎస్ రాయుడు, సిహెచ్ ఏడుకొండలు, చక్రవర్తి, దుర్గా లక్ష్మి, అరుణ, వసంత, బేబి రాణి, లలిత, దయానంద్, రమణ, శ్రీనివాస్, పవన్, శివ శంకర్, ధనుంజయ్, ప్రసాద్, మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర-తిరువూరు: భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించి, పెండింగ్ క్లైములు వెంటనే పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి షేక్ ఉమర్ వలీ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల చేపట్టిన జిల్లా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ తిరువూరులో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. సంఘ మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఉమర్ వలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు నిధులను ఇతర పథకాలకు మళ్ళించడం శోచనీయమన్నారు. 2006లో సంక్షేమ బోర్డు ప్రారంభించినప్పటి నుంచి 22లక్షల మంది కార్మికులు లబ్ధిపొందారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ నాలుగేళ్లలో 32వేల క్లైములు పెండింగ్ లో ఉన్నాయని ఆరోపించారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు కేటాయించిన 1600 కోట్ల నిధులు ప్రభుత్వం పవర్ కార్పొరేషన్ వాడుకోవడం వల్ల కార్మికుల కుటుంబాలు నానా అవస్తలు పడుతున్నారని ఉమర్ వలీ ఆవేదన వ్యక్తంచేశారు. ఏఐటీయుసీ నియోజకవర్గ కార్యదర్శి కొత్తపల్లి సుందరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో నూతన ఇసుక పాలసీ అమలు చేసి భవనాల నిర్మాణానికి కావలసిన ఇసుక అందుబాటులో లేకుండా చేయడం వల్ల నిర్మాణ రంగం నిలిచిపోయిందన్నారు. చేయడానికి పనులు లేక, పూట గడవక 32 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన విమర్శించారు. ఇసుక ధర టిప్పరు రూ.32 వేలకు చేరడంతో స్టీలు, సిమెంటు, కంకర, ఇనుము ధరలు కూడా విపరీతంగా పెరిగి భవన నిర్మాణ రంగం స్తంభించి పోయిందని, దీని ఫలితంగా కార్మికులు పస్తులు పడుకునే దుస్థితి దాపురించిందని సుందరరావు ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునః ప్రారంభం చేసి, పెండింగ్లో ఉన్న క్లైములన్ని పరిష్కరించాలని ఉమర్ వలీ, సుందరరావు డిమాండ్ చేశారు. ఈ నెల 15న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే మహా ధర్నాకు బిల్డింగ్ వర్కర్స్ వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపనిచ్చారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ తిరువూరు మండల ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా (కార్పెంటర్), సంఘ నాయకులు షేక్ అబ్దుల్ హుస్సేన్, కొలేటి గోపాలరావు, పింగళి శ్రీనివాసరావు, షేక్ సుభానీ, కామాల రామారావు, మాదాసు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు 'మేమున్నాం' వితరణ

విశాలాంధ్ర-పెడన: పెడన మరియు చుట్టుపక్కల ప్రాంతాల్లో నిరుపేద కుటుంబాలకు, వృద్ధులకు, మేమున్నాం సేవా సంస్థ ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని సంస్థ సభ్యులు తెలిపారు. పెడన పట్టణంలోని బ్రహ్మపురం నిరుపేద చేనేత కుటుంబానికి చెందిన నున్న సాయి పావని నూజివీడు పాలిటెక్నిక్(ఈ సి ఈ) మొదటి సంవత్సరం ఫీజు 30,000/- కాగా, తక్షణ సహాయంగా 10,000/- లు నగదను వారి తల్లి శ్యామల గౌరీ కి వితరణగా అందించారు. ఆమె చదువుకు సహకరించాలనుకునే, వివిధ స్వచ్ఛంద సంస్థలు వారు మరియు మనసున్న మారాజులు సాయి పావని ఉన్నత చదువుల ఆశయ సాధనకు సహకరించాలని 9032272388 ఈ నెంబర్ కి వివరాలు తెలపాలని కోరారు.

రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి మహాయజ్ఞం

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి నిర్వహిస్తున్న మహా యజ్ఞాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం లో ఈ నెల 17 వరకు రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అష్టోత్తర శత(108) కుండాత్మక చండి,రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞం నిర్వహణపై శనివారం డిప్యూటీ సీఎం, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మీడియా పాయింట్ వద్ద పాత్రికేయుల సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహా యజ్ఞం రెండో రోజుకు చేరుకుందన్నారు. శాస్త్రోక్తంగా, శాస్త్రీయంగా ఇటువంటి యజ్ఞం ఎక్కడా జరగలేదని ఇది ఒక అత్యద్భుత కార్యక్రమం అని, ఎవరు ఊహించిన విధంగా పురాతన ఇతిహాసాలలో మునులతో అలనాటి మహారాజులు నిర్వహించే మహా యజ్ఞ కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహించడం గొప్ప విషయం అని ప్రతి భక్తుడు భక్తితో పరవశిస్తున్నారన్నారు. ఈ మహా యజ్ఞంలో దేవాదాయశాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్, నగరపాలక సంస్థ, విద్యుత్, ఫైర్ అన్ని శాఖలకు చెందిన వారు సహకారం అందిస్తున్నారని ఇది వారు తమ అదృష్టంగా భావిస్తున్నారన్నారు. మహా యజ్ఞాన్ని, ఇక్కడి పవిత్ర కృతులను చూసిన ప్రతి భక్తుడు తమ జన్మ తరించిందని ఇటువంటి మహాభాగ్యాన్ని చూసే అదృష్టాన్ని కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. ప్రతిరోజు చతురాగమ యాగశాలల యందు, 108 కుండములలో హెూమం, అర్చనలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రధాన యాగశాలలో అగ్ని మథనం, అగ్ని ప్రతిష్ట 108 కుండములలో అగ్నిస్థాపన, హెూమాలు జరుగుతున్నాయన్నారు. తమిళనాడు నుండి వచ్చిన రుత్విక్కులతో వారి ఆచారం మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. 550 మందికి పైగా రుత్వికులు, వారికి సహాయంగా 300 మంది యజ్ఞ యాగ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. 32 మంది సన్నాయి, డోలు వాయిద్య కళాకారులు శాస్త్రోక్తంగా యాగశాలకు అనుసంధానం చేస్తూ వారి సహకారం అందిస్తున్నారన్నారు. యాగశాలకు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారని అన్నారు. యాగశాలను సందర్శించే భక్తులకు ఎటువంటి పాసులు అవసరం లేదని, భక్తులు మహా యజ్ఞాన్ని దర్శించుకునేందుకు దేవాదాయశాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. సాయంత్రం నిర్వహించే కార్యక్రమంలో కొద్ది మార్పులు చేశామన్నారు. సాయంత్రం ఐదు గంటల నుండి 6:30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, 6:30 నుండి 7:30 వరకు ప్రవచనాలు, 7:30 నుండి స్వామి అమ్మవార్ల కళ్యాణ మహెూత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు యాగశాలను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి తరించుకోవాలని డిప్యూటీ సీఎం, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మాత్యులు కొట్టు సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.ఈ పాత్రికేయులు సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆర్. సత్యనారాయణ మరియు దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తనిఖీల పేరుతో వేధింపులు మానుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ : తనిఖీల పేరుతో రాష్ట్రంలో ఉన్న ఓకేషనల్ కళాశాలల యాజమాన్యాలను ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓకేషనల్ జూనియర్ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి శాంతి కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం నగరంలోని ఒక హెూటల్‌లో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ కనీస సౌకర్యాలు కల్పించని కార్పొరేట్ కళాశాలలకు ఇంటర్ బోర్డు కొమ్ముకాస్తుందని ఆరోపించారు. ఎక్కువ మొత్తల్లో ఫీజులు చెల్లించలేని గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న ఓకేషనల్ కళాశాలపై తరచుగా ఇన్స్పెక్షన్ పేరుతో దాడులు చేయడం దారుణమని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇన్స్పెక్షన్ లు రద్దు చేసి కళాశాలల ఉనికిని కాపాడాలని కోరారు. అదేవిధంగా కళాశాలలకు బోధనా రుసుమును పాతవిధానం లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

భవానీపురంలో భారీగా గంజాయి

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: విజయవాడ భవానీపురం పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. సుమారు 20కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కృష్ణలంకకు చెందిన ముగ్గురు, సింగ్‌నగర్‌కు చెందిన ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే భవానీపురం ఆట్కిన్‌సన్ స్కూల్ రోడ్డులోని నిర్మాష్య ప్రాంతంలో యువకులు ఉన్నారని సమాచారంతో సీఐ అబ్దుల్ సలాం, ఎస్సై అనూషలు యువకుల పై దాడి చేసి వారి వద్ద నుండి 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ యువకులకు బంధువులైన మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి ఈ గంజాయి తీసుకువచ్చినట్లు సమాచారం. కేసు నమోదు చేసిన పోలీసులు మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వక్ఫ్ బోర్డు ప్రత్యేక అధికారిని దూషించిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు ప్రత్యేక అధికారి షరీన్ బేగంను అసభ్యపదజాలంతో దూషించి, అభ్యంతరకర విధంగా ప్రవర్తించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆమె పీఏ ముర్దార్ అన్సారీ శనివారం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వైఎస్సార్ జిల్లా సిద్దవటానికి చెందిన పిర్ సయ్యద్ షా షబ్బీర్ అహ్మద్ ఆలం ఖాద్రి ఈ నెల 11వ తేదీన వక్ఫ్ బోర్డు ప్రత్యేక అధికారి షరీన్ బేగంను దూషిస్తూ అసభ్యకరంగా ప్రవర్తించాడని, ఆమె విధులకు ఆటంకం కల్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. విజయవాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోర్టు నిర్మాణంతో బందరు దశ మారబోతుంది

విశాలాంధ్ర, మచిలీపట్నం : బందరు పోర్టు ద్వారా కృష్ణాజిల్లా దిశ మారనుందని దశాబ్దాల కల నెరవేరబోతుందని బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ఆశభావం.వ్యక్తం చేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో శనివారం బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బందరు పోర్టు ఈనెల 22వ తేదీన జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభమవుతున్నాయని స్పష్టం చేశారు. ఇప్పటికీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి 3 వేల.941 కోట్లు మంజూరు అయ్యాయి అన్నారు. పోర్టు పనుల నిమిత్తం 5 వందల కోట్లు రిలీజ్ అయినట్టు ఆయన వెల్లడించారు.ఈ పోర్టు ద్వారా రైల్వే కనెక్టివ్ టీ కోసం మచిలీపట్నం రేపల్లె కొత్త రైల్వే లైను నిర్మించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరిపామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా తెలియజేశామని అవసరమైతే దీని ప్రాజెక్టు చేర్చి 7 వందల కోట్లతో అమలు చేసే దివిసీమ ప్రజల కోరిక నెరవేరుతుందని ఎంపీ తెలిపారు.

తాగునీరు ఏది... శుద్ధ కృష్ణాజలాలు ఎక్కడ?

గుక్కెడు తాగునీరు కోసం విలవిలలాడుతున్న గిరిజన తండాలు

పట్టించుకోని పాలకులు, అధికారులు

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

విశాలాంధ్ర-ఎ కొండూరు : మండలంలోని గిరిజన తండాలు గుక్కెడు శుద్ధకృష్ణా జలాల కోసం ఎదురు చూస్తున్నాయి. మధ్య అసలే ఈ ప్రాంతంలో ఉన్న నీటిలో సిలికా ఉన్నదని ప్రభుత్వ అధ్యయనాల ద్వారా తెలిసిన విషయం అందిరికీ తెలిసిందే... ఐతే ఈ ప్రాంతంలో 15 సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధులతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. కొంత మంది వ్యాధి భారినపడి మంచన మూలుగుతున్నాను. ఈ ప్రాంతంలో ఈ తరహా క్రానిక్ కిడ్నీ డిసీజ్‌కీ కారణం మాత్రం తాగునీటిలో అధిక శాతం సిలికా ఉండటమే ప్రధాన కారణం అని ప్రభుత్వా అధికారులు తేల్చారు. ప్రాంతంలో ఉన్న కిడ్నీ సమస్యను పరిష్కరించే దిశగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ఇ వెంకటరమణలు ఒక ప్రణాళిక ప్రకారం ప్రతి ఒక్క గిరిజన తండాలో సింటెక్స్ ట్యాంకులను నిర్మించి వాటిలో రెడ్డిగూడెం మండలం కుదప కృష్ణా జలాల సంపు నుండి నీటిని ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా తరలించి గిరిజన తండాల్లో ఉన్న ట్యాంకర్లలో నింపుతున్నారు.

ఈ ప్రక్రియ మొత్తం గత కొంతకాలం సజావుగా జరిగిన ఈ మధ్యకాలంలో ట్యాంకుల్లో పోసే శుద్ధమైన కృష్ణ జలాలు మురికిగా ఉంటున్నాయని వాటిలో చిన్నచిన్న తోక పురుగు వంటివి కూడా ఉంటున్నాయని గిరిజన తండాలలో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుద్ధమైన కృష్ణా జలాల సమస్యను ఇప్పటికి కొన్ని వందలసార్లు మండల జిల్లా అధికారులతో పాటు స్థానిక అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు తెలియజేశామని కానీ ఏ ఒక్కరూ కూడా సమస్యను పరిష్కరించే దిశగా ఆలోచించడం లేదని గిరిజనులు అంటున్నారు. ఎన్నో వేల కోట్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఖర్చు పెట్టే ప్రభుత్వం గుక్కెడు శుద్ధమైన కృష్ణా జలాలను అందించలేకపోవడం సిగ్గుచేటని పలువురు గిరిజన నేతలు ఆరోపిస్తున్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు నెలకు పదివేల రూపాయలు పింఛన్ ఇస్తేనో ప్రభుత్వం మందులు ఉచితంగా ఇస్తేనో సమస్య పరిష్కారం కాదని, ఈ కిడ్నీ మహమ్మారి శాశ్వత పరిష్కారం శుద్ధమైన కృష్ణ జలాలేనని పలువురు అంటున్నారు. ఈ కిడ్నీ సమస్య ఈ ప్రాంతంలో ఇంతలా పెరిగిపోవడానికి ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యమేనని, ఇంత నిర్లక్ష్యం కారణంగానే ఈ కిడ్నీ మహమ్మారి మా తండాలపై పడి వందలాదిమందిని బలి తీసుకుందని పలువురు గిరిజనులు తమ బాధను వెళ్ళగక్కుతున్నారు.

గతంలో మా ఆహారపు అలవాట్లపై మాట్లాడిన రాజకీయ నాయకులు ఇప్పుడు తాగునీరులో సిలికా ఉందని తెలిసిన తర్వాత ఏం సమాధానం చెబుతారని గిరిజనులు నాయకులను సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఈ మండలంలో ఇంతలా కిడ్నీ వ్యాధులు ప్రబలి ఉన్న స్థానిక అధికారులు కానీ, జిల్లా అధికారులు గానీ ఏమి పట్టనట్టు వ్యవహరించడం సరికాదని సమస్యను శాశ్వత పరిష్కారం దిశగా పనిచేయాలని కోరుతున్నారు. అలానే రెండు రోజులుగా మండలంలోని మత్రియ తండా చైతన్యనగర్ తండాలలో కృష్ణా జలాలు చాలా మురికిగా వస్తున్నాయని ఆ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదని ఉమ్మడి జిల్లాల ఎస్ఎఫ్ఐ నాయకుడు కుమార్‌నాయక్ ఆరోపించారు. ఇదే విధంగా కృష్ణాజిల్లాలు సరఫరా విషయంలో ప్రభుత్వం అధికారులు మొండివైఖరి ప్రదర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన అన్నారు.

కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

సీపీఐ మండల కార్యదర్శి మేకల దేవిడ్

కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం దిశగా శుద్ధమైన కృష్ణా జలాలను తాగునీరుగా అందించాలని తాగునీరుగా వస్తున్న కృష్ణా జలాలు పూర్తిగా మురికిగా ఉండటంతో ఆ నీటిని తాగలేకపోతున్నారని ప్రభుత్వానికి అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారి పందానీ మాత్రం మార్చుకోవడం లేదని ఆయన అన్నారు. తాగునీటి విషయంలో ఇదే అలసత్వం అధికారులు ప్రదర్శిస్తే మండల కార్యాలయాలు ముందు ధర్నా కార్యక్రమం చేపడతామని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని అధికారులను హెచ్చరించారు.